# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

**ప్రాంతీయ వార్తలు**

**తేది : 24-05-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఫలితాలను త్వరితగతిన ప్రకటించేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అధికారులను ఆదేశించారు.**
2. **ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియట్, పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఈ రోజు నుంచి జరుగుతాయి.**
3. **తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈరోజు నుంచి ప్రారంభమవుతాయి.**
4. **సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఐదో విడతలో జరిగిన ఎన్నికల్లో 62.2 శాతం పోలింగ్ నమోదైనట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.**
5. **ఐపిఎల్‌లో భాగంగా ఈ రోజు రాజస్థాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య క్వాలిఫయర్-2 క్రికెట్ మ్యాచ్ జరగనుంది.**

==========================

జూన్ 4వ తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఫలితాలను త్వరితగతిన ప్రకటించేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులను ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నుండి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో నిన్న ఆయన దృశ్య మాధ్యమం ద్వారా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ, ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. ఓట్ల లెక్కింపు ఏవిధంగా జరుగుతుందో రాతపూర్వకంగా సంబంధిత అభ్యర్థులకు, ఎన్నికల ఏజెంట్లకు ముందుగానే తెలియజేయాలన్నారు. లెక్కింపు కేంద్రంలో పార్లమెంట్, శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించి వేర్వేరుగా ఓట్ల లెక్కింపు టేబుళ్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు ప్రత్యేక టేబుళ్లు ఏర్పాటు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలతో పటిష్టమైన మూడంచెల భద్రత కొనసాగుతున్నదని, స్ట్రాంగ్ రూమ్‌లను సీసీ కెమెరాల ద్వారా నిరంతరం అధికారులు పర్యవేక్షిస్తుండాలని తెలిపారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ రోజు నుంచి ప్రారంభమవుతాయి. రోజుకు రెండు విడతల్లో జూన్1వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షల్ని నిర్వహించనున్నారు. ఇంటర్ ప్రథమ

సంవత్సరం పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షల్ని మధ్యాహ్నం రెండున్నర నుంచి ఐదున్నర వరకు నిర్వహిస్తారు. సప్లిమెంటరీ పరీక్షల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 861 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వేసవి నేపథ్యంలో పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు అరగంట ముందే చేరుకోవాలని ఇంటర్ బోర్డు అధికారులు సూచించారు.

మరో వైపు ఈ రోజు నుంచి జూన్ 3వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు కూడా జరగనున్నాయి. ఈ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా లక్షా 61 వేల 877 మంది హాజరుకానున్నారు. ఉదయం 9 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12 గంటల 45 నిమిషాల వరకు ఈ పరీక్షలు జరుగుతాయని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు దేవానందరెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులను ఉదయం 8 గంటల 45 నిమిషాల నుంచే అనుమతిస్తామని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హాల్‌టికెట్లను తీసుకురావాలని తెలిపారు.

---------------------------

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ రోజు నుంచి ప్రారంభమవుతాయి. జూన్ 3 వరకు జరిగే ఈ పరీక్షలను మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు , ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాల నుంచి సాయంకాలం 5 గంటల 30 నిమిషాల వరకు నిర్వహిస్తారు. మొత్తం 4.6 లక్షల మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 900 పరీక్షాకేంద్రాలను ఇంటర్‌బోర్డు ఏర్పాటు చేసింది.

అలాగే తెలంగాణ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించే పాలిసెట్ పరీక్ష కూడా ఈ రోజు జరగనుంది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటా 30 నిమిషాల వరకు పరీక్ష జరుగుతుందని అధికారులు తెలిపారు. పాలిసెట్పరీక్షకు తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 259 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని చెప్పారు. హాల్ టికెట్ మీద ఫొటో ప్రింట్ కాని విద్యార్థులు పాస్ ఫోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్ కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

---------------------------

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఐదో విడతలో జరిగిన ఎన్నికల్లో 62.2 శాతం పోలింగ్ నమోదైనట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. అత్యధికంగా పశ్చిమబెంగాల్లో 78.48 శాతం, బీహార్‌లో అత్యల్పంగా 56.76శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపింది. మే 20న 8 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 49 లోక్ సభ నియోజక వర్గాల్లో పోలింగ్ జరగగా, అయిదో విడతలో పురుషుల కంటే మహిళలే అత్యధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారని ఎన్నికల సంఘం వివరించింది. ఐదో విడత ఎన్నికల్లో మహిళలు 63 శాతం, పురుషులు 61.48 శాతం, థర్డ్ జెండర్ 21.96 శాతం మంది ఓటు హక్కును వినియోగించారని ఎన్నికల సంఘం పేర్కొంది.

---------------------------

టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా –ట్రాయ్ పేరుతో వచ్చే అసత్య సమాచారాన్ని నమ్మ వద్దని తెలంగాణ అదనపు డీజీ మహేష్ భగవత్ ఓ ప్రకటనలో తెలిపారు. ట్రాయ్ పేరుతో ఫోన్స్, సిమ్ కార్డులు బ్లాక్ అవుతాయంటూ ఫేక్ కాల్స్, మెసేజ్‌లు వస్తున్నాయని అటువంటి వాటికి స్పందించవద్దని ప్రజలకు సూచించారు.

సైబర్ నేరాల ఫిర్యాదుల కోసం 1930 టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించవచ్చని లేదా సైబర్ క్రైం వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్ –ఐపిఎల్ క్రికెట్‌లో భాగంగా చెన్నై వేదికగా ఈరోజు రాజస్థాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య క్వాలిఫయర్–2 క్రికెట్ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఫైనల్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో పోటీ పడనుంది.

------------------------

ఆంధ్రప్రదేశ్‌లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న క్రమంలో రానున్న రెండురోజులు వడగాడ్పులు వీయనున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ రోజు ఉత్తరాంధ్రలోని 33 మండలాల్లో, రేపు కోస్తాంధ్రలోని 24 మండలాల్లోనూ వడగాడ్పులు వీచే అవకాశం ఉందని తెలిపింది. అలాగే తెలంగాణలోని పలు జిల్లాల్లో ఈ రోజు తేలిక పాటి వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉమ్మడి నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్, వరంగల్, మహబూబ్ నగర్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల పరిధిలో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడి వానలు పడే అవకాశాలు ఉన్నట్లు పేర్కొంది.

------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఈశాన్య దిశగా పయనిస్తూ తీవ్ర అల్పపీడనంగా బలపడిందని బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశముందని భారత వాతావరణశాఖ పేర్కొంది. బంగాళాఖాతంలో తుపానుగా బలపడి తర్వాత ఉత్తర దిశగా పయనించి పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్ తీరాలకు చేరువగా ఆదివారం సాయంత్రానికి తీవ్ర తుపానుగా మారుతుందని తెలిపింది. పశ్చిమబెంగాల్, ఉత్తర ఒడిశా, మిజోరం, త్రిపుర, మణిపుర్ రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో తేలికపాటి మినహా భారీ వర్షాలకు అవకాశం లేదని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం తెలిపింది.

------------------------

కాళేశ్వరం మేడిగడ్డ ప్రధాన బ్యారేజీకి మరమ్మతులను చేపట్టాలని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నిన్న హైదరాబాద్లోని సచివాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మేడిగడ్డ పునరుద్ధరణ పనులపై జాతీయ ఆనకట్టల భద్రత పర్యవేక్షణ సంస్థ–ఎన్డీఎస్ఏ ప్రభుత్వానికి అందజేసిన నివేదిక మేరకు పనులు కొనసాగించాలన్నారు. వర్షాకాలం వచ్చేలోగా తీసుకోవాల్సిన పరిరక్షణ చర్యల్లో భాగంగా బ్యారేజీ వద్ద తాత్కాలిక పనులను పూర్తి చేయాలని సూచించారు. మేడిగడ్డ పనుల పురోగతిపై ఎప్పటి కప్పుడు నివేదికలు అందించాలని, రోజువారీ పురోగతిని సమీక్షించాలని అధికారులను ఆదేశించారు.

------------------------

తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రి లక్ష్మినరసింహ స్వామి ఆలయంలో దర్శనానికి, పూజా కార్యక్రమాల కోసం ఆన్ లైన్ బుకింగ్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చామని ఆలయ కార్యనిర్వహణాధికారి భాస్కరరావు తెలిపారు. భక్తులు దేవస్థాన వెబ్ పోర్టల్ yadadritemple.telangana.gov.in ద్వారా ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. యాదాద్రి దేవస్థానంలో జరిగే ఆర్జిత సేవల్లో పాల్గొనే భక్తులకు సంప్రదాయ దుస్తులు తప్పనిసరిగా ధరించాలని, ఈ విధానం జూన్ 1 నుంచి అమల్లోకి వస్తుందని చెప్పారు.

-----------------------------

ఫిలిప్పీన్స్‌లో భారత నౌకాదళం చేపట్టిన ఆపరేషనల్-సి చెక్స్ గస్తీ విన్యాసాలు పూర్తయినట్టు నావికాదళ వర్గాలు తెలిపాయి. భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ శక్తి, ఐఎన్ఎస్ ఢిల్లీ, ఐఎన్ఎస్ కిల్తాన్ నౌకలు ఈస్ట్రన్ ఫ్లీట్ తరఫున అక్కడ గస్తీ విన్యాసాలు కొనసాగించినట్టు పేర్కొన్నాయి. ఇరుదేశాల భాగస్వామ్య ఒప్పందంలో భాగంగా ఇరుదేశాల నౌకాదళ సిబ్బంది మధ్య సాంకేతిక పరిజ్ఞానం మార్పిడి, క్రీడలు, సాంస్కృతిక పోటీలతో పాటు, సామాజిక అంశాలపై పలు కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపాయి. భారత్ నుంచి నావికాదళ ఉన్నతాధికారులు.. ఫిలిప్పీన్స్ ఉన్నతాధికారులతో సమావేశమై వివిధ అంశాలపై చర్చించినట్టు నావికాదళ వర్గాలు పేర్కొన్నాయి.

-----------------------------

జూన్ 6వ తేదీ వరకు అనకాపల్లి జిల్లాలో బాణాసంచా ఉపయోగించడంపై నిషేదం విధించినట్లు జిల్లా అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ తెలిపారు. నిన్న కలెక్టర్ కార్యాలయంలో బాణాసంచా తయారీదారుతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఎటువంటి బాణాసంచాను తయారు చేయరాదని, పేలుడు సామాగ్రిని విక్రయించకూదని చెప్పారు. పేలుడు పదార్థాలను ఎవరు ఉపయోగించినా వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

-----------------------------

కిర్గిజిస్తాన్ లో చదువుతున్న ఆంధ్రప్రదేశ్ విద్యార్థులను దేశానికి రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెట్ తెలుగు సొసైటీ-ఏపీఎన్ఆర్టీ ముఖ్య కార్యనిర్వహణాధికారి హేమలత తెలిపారు. విదేశీ వ్యవహారాల శాఖ నిన్నటి నుంచి ప్రతిరోజు కిర్గిస్థాన్‌లోని బిష్కెక్ నుంచి ఢిల్లీకి నేరుగా రెండు విమానాలు నడుపుతోందని వెల్లడించారు. తెలుగు విద్యార్థులతో ఏపీఎన్ఆర్టీ సొసైటీ నిరంతరం మాట్లాడుతూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామన్నారు. విద్యార్థుల భద్రతపై ఎప్పటికప్పుడు విదేశీ వ్యవహారాల శాఖకు తెలియజేస్తున్నామన్నారు. భారత రాయబార కార్యాలయం 0555710041 హెల్ప్‌లైన్ నెంబరు ఏర్పాటు చేసిందని, సమాచారం కోసం కిర్గిజిస్తాన్‌లోని భారతీయ విద్యార్థులు బిష్కెక్‌లోని రాయబార కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు.

======================